

కథా కౌముది

# ఆర్ -9

## యశస్వి జవ్వాది



పిడపర్తి వెంకటరమణశర్మగారి జ్ఞాపకార్థం
కౌముది నిర్వహించిన కథల పోటీ (2023)లో
విశిష్ట బహుమతి పొందిన కథ

**అగస్త్య వేగంగా** డాక్టర్ భరద్వాజ ల్యాబ్ చేరాడు. అప్పటికే భరద్వాజ సోఫాలో కూర్చుని దీర్ఘమైన ఆలోచనలో మునిగి ఉన్నాడు.

అగస్త్య రాకను గమనించి, "అగస్త్యా! డిపార్ట్మెంట్‌లో నిన్ను తప్ప మరో ఆఫీసర్‌ను నేను నమ్మలేను. నువ్వే నాకు సహాయం చేయాలి" అని ఆందోళన నిండిన గొంతుతో పలికాడు.

అగస్త్య ల్యాబ్ చుట్టూ చూసాడు. ల్యాబ్ పాక్షికంగా ధ్వంసమై ఉంది. ల్యాబ్ నుండి నేరుగా బయటకు తెరుచుకునే కిటికీ అద్దం పగిలింది. దాని తాలూకా గాజు ముక్కలు కొన్ని ల్యాబ్ లోపల పడి ఉన్నాయి. ఫైర్ అలారం ఆన్ అయ్యి, వాటర్ స్ప్రింకిలైందని ఫ్లోర్ మీద నీటిని చూసి అర్థం చేసుకున్నాడు.

భరద్వాజ నుంచి దూరంగా అడుగులు వేస్తూ, గది అటువైపు ఉన్న ఫిల్టర్ పాయింట్ నుంచి ఒక గ్లాసు నిండా నీళ్ళు తీసుకొచ్చి అతనికి ఇచ్చి తాగమని చెప్పి ఎదురుగా కూర్చున్నాడు. భరద్వాజ మెల్లిగా నీళ్ళు తాగి, మనసును స్థిమిత పరుచుకుని అగస్త్య వంక చూసాడు.

అప్పుడు అగస్త్య, "చెప్పండి డాక్టర్ అసలేమైంది?" అనడిగాడు.

భరద్వాజ భయం నిండిన కళ్ళతో, "అగస్త్యా! శాస్త్రవేత్తగా నేనొక పొరపాటు చేసాను. ఆ పొరపాటు నన్ను ప్రమాదంలోకి నెట్టింది. ప్రమాదమని చెప్పి తప్పించుకునే ప్రయత్నం చేయను" అని ఒక క్షణం ఆలోచించి కళ్ళద్దాలు

తీస్తూ, "లాస్ట్‌మంత్, నేను వర్క్ చేస్తున్న క్లోనింగ్ టెక్నాలజీలో భాగంగా సంపూర్ణంగా సిద్ధమైన ఒక క్లోన్ క్లోజర్ ఓపెన్ చేసి దానిని బయటకు తీసాను. అవి నా మెమరీ పంచుకోవడం వల్ల అవి నాలానే ఆలోచిస్తున్నాయి. అవి పూర్తిగా నా మాట వింటాయని నేను అనుకున్నాను. ఆ క్లోన్‌కి నేను పెట్టిన పేరు "ఆర్ -9".

నేను ఊహించిన దానికంటే ఆర్ - 9 చాలా అడాప్టివ్ నేచర్ కలిగి ఉంది. నేను దానిని అధ్యయనం చేయడంకాదు. అదే నన్ను అధ్యయనం చేయడం మొదలెట్టింది. నేను దానిని గ్రహించలేకపోయాను. దాని ఆలోచనా పరిమితి ఒక స్థాయిని మించి ఉండదనుకున్నాను. కానీ, నా అంచనాలు తారుమారు చేస్తూ నన్ను ప్రతీక్షణం ఆశ్చర్యంలోకి నెట్టింది. నాకు మొదట చాలా హ్యాపీగా అనిపించింది. ప్రతీ ప్రోగాంలో ఒక సెల్ఫ్ డిస్ట్రక్టివ్ మోడ్ ఉన్నట్టే ఆర్-9లో కూడా ఒకటి ఉంది. అది దాని గురించి తెలుసుకోవడానికి చాలా ప్రయత్నం చేసింది. దానికి స్వాతంత్ర్యంగా జీవించడంలో ఆసక్తి ఉందని నేను గుర్తించలేదు. అలాగే దాని ప్రాణాల మీద కూడా దానికి ఆశ ఉంది. నిజానికి ఈ లక్షణం నా డి.ఎన్.ఏ నుండే దానికి సంక్రమించింది. ఈ రోజు ఉదయం నన్ను ఆ సెల్ఫ్ డిస్ట్రక్టివ్ మోడ్ అన్లాక్ చేసి, ఆఫ్ చేయమని బెదిరించింది. దానిని చూస్తే భయం వేసింది. నేను ఒప్పుకోలేదు. నన్ను దూరంగా తోసి ఆ కిటికీ గుండా బయటకు పారిపోయింది. ఇప్పుడు అది ఎక్కడ ఉందో ఏం చేస్తుందో నాకేమీ తెలియదు. నువ్వు వెంటనే దానిని కనిపెట్టి ప్రాణాలతో గానీ లేదా శవంగానైనా నా ముందుకు తీసుకురా, ప్లీజ్ అగస్త్యా" అని అడిగాడు.

అగస్త్య మనసులో, 'ఇది అసంభవం..!' అనుకుని, "డాక్టర్ ముందు నాకొక నిజం చెప్పండి. మీ క్లోనింగ్ టెక్లాలజీలో లోపం ఉందనే కదా, భారత ప్రభుత్వం దానికి సంబంధించిన అన్ని ప్రయోగాలు నిషేధించారు. కానీ, మీరేమో పూర్తిగా సిద్ధమైన క్లోన్ తప్పించుకుంది అంటున్నారు.." అని అనుమానంగా చూసాడు.

భరద్వాజ "యస్ అగస్త్యా! అందుకే నా భయం. ఈ విషయం బయటకు తెలిస్తే నా ప్రయోగాల వరకే ఉన్న నిషేధం నామీద కూడా పడుతుంది. నేను ఈ ప్రయోగమే సర్వస్వం అనుకున్నాను. అదే నేను చేసిన పెద్ద తప్పు. ఇప్పుడు దానిని నేను సరిచేసుకోవలనుకుంటున్నాను. అందుకే నీ సహాయం అడిగాను" అని తలదించుకున్నాడు.

అగస్త్యకు భరద్వాజ మాటల్లో పశ్చాత్తాపం గ్రహించి, "అసలు మీరెందుకని ఇంతలా భయపడుతున్నారు, అది జస్ట్ క్లోన్ అంతే. పైగా అది మీ ఆలోచనల నుండి పుట్టిన క్లోన్. మీలానే ఉంటుంది. కాకపోతే దానిని ఎవరైనా గుర్తిస్తేనే ప్రమాదం. మీరింతలా ప్రమాదం జరుగుతుందని భయపడవలసిన అవసరంలేదు కదా?" అని అడిగి ఒక్కక్షణం ఆలోచించి, అతని మొహంలోకి పరిశీలనగా చూస్తూ, "మీరేమైనా నా దగ్గర దాస్తున్నారా?" అనడిగాడు.

భరద్వాజ, "నాకైనా నీకైనా ఉనికి అనేది చాలా ఇంపార్టెంట్ అగస్త్యా. మనం మనుగడలో ఉంటేనే ఉనికి ఉంటుంది. మనుగడ కోసం చేసే పోరాటంలో మనిషిని మించిన మృగం మరొకటి ఉండదు. ఆర్ -9 తాను బ్రతకడం కోసం నన్ను చంపాలని చూస్తుంది. నా జీవితాన్ని అది అనుభవించాలని చూస్తుంది. అది నన్ను చంపడానికి ఖచ్చితంగా

వస్తుంది. ఈలోపే దానిని మనం పట్టుకోవాలి. నాకు హాని తలపెట్టడం ఇష్టంలేదు. అందుకే నీ సహాయం కోరాను. దానిని ఎలాగైనా ప్రాణాలతో పట్టుకోవాలి ఇక లేదంటే.." అని అగస్త్య నడుముకున్న తుపాకీ వంక చూసాడు.

అగస్త్య, "మిమ్మల్ని చంపి ఆ క్లోన్, అదే ఆర్ – 9 మీ స్థానంలో జీవించాలనుకుంటుందా. వెరీ స్ట్రేంజ్" అని పైకి లేచి సీసీ టీవీల వంక చూసి, "నేనొకసారి ఆ ఫుటేజెస్ చూడాలి" అనడిగాడు.

భరద్వాజ డెస్క్ వద్దకు వెళ్ళి సిస్టంలో ఫుటేజులు స్టోర్ అయ్యే ఫోల్డర్ ఓపెన్ చేసి, "ఇటు చూడు అగస్త్యా ఈ ఫోల్డర్‌లో ఒక్క వీడియో లేదు. చివరి నెల మొత్తం ఒక్క బైట్ కూడా సేవ్ కాలేదు. ఇదంతా ఆ క్లోన్ పనే. సేవ్ అయ్యుంటే సిస్టంలో డిలీట్ చేసినా సర్వర్ నుండి డౌన్లోడ్ చేసుకోవచ్చు" అని నిరాశగా చెప్పాడు.

అగస్త్య ఫోల్డర్ ఒకసారి చెక్ చేసి "ఆ క్లోన్ ఎక్కడికి పారిపోయింది? మీరేమైనా గెస్ చేయగలరా?" అనడిగాడు.

భరద్వాజ, "నేను క్లోన్ బాడీలో ఓ ట్రాకర్ సెట్ చేసాను. అది దానిని గుర్తించి శరీరం నుండి పీకి పాడేసింది. దాని లాస్ట్ లొకేషన్ మాత్రమే నా దగ్గరుంది" అని కంప్యూటర్ పక్కనే ఉన్న ఒక ఫైల్ చేతిలోకి తీసుకుని, "ఇదిగో ఇదే ఆర్ -9 ఫైల్. దీనిని కొంచెం స్టడీ చేస్తే నీకే దాని స్వభావం అర్థమవుతుంది. మే బీ, దాన్ని పట్టుకోవడంలో నీకు హెల్ప్ అవుతుంది" అన్నాడు.

అగస్త్య ఆ ఫైల్ అందుకుని, "సరే నాకా లొకేషన్ షేర్ చేయండి. ఆ క్లోన్ నేరుగా మన వాతావరణంలోకి వచ్చేసింది. దానికేమీ ఎఫెక్ట్ కాదా?" అనడిగాడు.

భరద్వాజ, "చెప్పాగా అగస్త్యా! అది పూర్తిగా అడాప్టివ్ అయింది. ఇంకో విషయం అగస్త్యా. దాని ప్రాణాలకు ప్రమాదం ఉందని తెలిస్తే మాత్రం అది ఎంతటి పనికైనా పూనుకుంటుంది. కాబట్టి దానితో చాలా కేర్ఫుల్‌గా ఉండాలి" అని చెప్పాడు.

అగస్త్య ల్యాబ్ నుండి బయటకు అడుగులు వేస్తూ "డాక్టర్ ఆ క్లోన్ ల్యాబ్‌లోకి రాగానే మీరు పోలీసులకు లొంగిపోవాలి. నిషేధించిన ప్రయోగాలు కంటిన్యూ చేసినందుకు మీరు జైలు శిక్ష అనుభవించాలి. దీన్ని మాత్రం మీరు తప్పించలేరు" అని చెప్పి అక్కడనుండి క్లోన్ యొక్క లాస్ట్ లొకేషన్ వైపు వేగంగా వెళ్ళాడు.

అగస్త్య ఆలోచనలు బండికన్నా ఎక్కువ వేగంతో సాగాయి. భరద్వాజకు ఇలా సహాయం చేయడం వల్ల తన ఉద్యోగం పోతుందేమోనన్న ఆలోచన బుర్రలో మెదిలింది. కానీ మనసు మాత్రం సహాయం చేయమని సంకేతం చేసింది. ఈలోగా లొకేషన్ వచ్చింది. బండిని ఆపి నడుస్తూ ఎక్సాక్ట్‌గా లొకేషన్ పాయింట్ వద్దకు చేరాడు.

అగస్త్య ఆ ప్రదేశం చుట్టూ చూసి, క్లోన్ జాడ కనిపెట్టే మార్గం గురించి ఆలోచించాడు. అప్పుడే అగస్త్య కళ్ళకు ఒక లొకేషన్ ట్రాకింగ్ చిప్ శకలం కనిపించింది. వెంటనే దానిని చేతిలోకి తీసుకుని ఫోటో తీసి భరద్వాజకు పంపాడు. దాన్ని చూసిన భరద్వాజ 'ఇది ఆ ట్రాకింగ్ చిప్‌లో ఓ భాగం...' అని మెసేజ్ చేసాడు.

అగస్త్య, 'ఐతే నేను సరైన మార్గంలోనే వెళ్తున్నాను...' అనుకున్నాడు.

వెంటనే భరద్వాజ యొక్క ఫొటోను సిటీ ట్రాఫిక్ మానిటరింగ్ బృందానికి పంపి, అతడ్ని వెతకమని ఆదేశం ఇచ్చాడు. అంతలో తెలియని నంబర్ నుండి అతనికొక కాల్ వచ్చింది.

అగస్త్య ఫోన్ లిఫ్ట్ చేసి, "హలో" అన్నాడు.

అటునుండి, "అగస్త్యా! నేను భరద్వాజ, నాకు నీ హెల్ప్ కావాలి. నన్నొక క్లోన్ చంపాలని చూస్తుంది. దానినుండి తప్పించుకుని సిటీ మాల్లోకి వెళ్ళిపోయాను. అది చాలా తెలివిగలది. దానికి సాధారణ మనిషిలా నటించడం తెలుసు, మోసం చేయడం తెలుసు.." అని అతను మాట్లాడుతూనే ఉన్నాడు.

అగస్త్యకు ఒక్కసారిగా ఆశ్చర్యమేసి, 'అంటే నేను ల్యాబ్‌లో మాట్లాడింది నిజమైన డాక్టర్‌తో కాదా? ఇతనే నిజమైన డాక్టరా?' అని నెత్తి పట్టుకుని, 'ఇప్పుడు వీళ్ళలో నిజమైన డాక్టర్ ఎవరనేది ఎలా తెలుస్తుంది?' అనుకున్నాడు.

అతను, "అగస్త్యా! అగస్త్యా నిన్నే అగస్త్యా" అని ఒక క్షణం విరామం ఇచ్చి, "అగస్త్యా! నువ్వు ల్యాబ్‌కి వెళ్ళావు కదా? నువ్వు నా క్లోన్‌ని కలిసావు కదా? అది నన్ను క్లోన్ అని చెప్పి తప్పించుకున్నానని చెప్పింది కదా? ఇదే నిజమైతే నువ్వు నన్ను చంపడానికి వచ్చావు" అని కోపం నిండిన గొంతుని మరింత పెంచి, "మాట్లాడవేంటి అగస్త్యా? లైన్‌లో ఉన్నావా? లేదా?" అటునుంచి అరుస్తూ ఉన్నాడు.

అగస్త్య అంతకంటే గట్టిగా, "స్టాప్ నువ్వే అసలు భరద్వాజ అనడానికి ప్రూఫ్ ఏంటి?" అనడిగాడు.

"అంటే? నువ్వా క్లోన్‌ని కలిసావు. అది నీమీద కూడా నిఘా పెట్టుంటుంది. అగస్త్యా నువ్వు కూడా ప్రమాదంలో ఉన్నావు. నువ్వు అర్జంట్‌గా సిటీ మాల్ దగ్గరకురా అన్నింటికంటే ముఖ్యమైన విషయం మరొకటి ఉంది. అదిగాని మిగతా క్లోన్స్ అన్నింటినీ ఆక్టివేట్ చేస్తే మాత్రం దానిని మనం ఆపలేము."

"అంటే ఇంకెన్ని క్లోన్స్ ఉన్నాయి?" మరింత ఆశ్చర్యంగా అడిగాడు అగస్త్య.

అంతలో ఫోన్ నుండి, " ఆ క్లోన్ నేనెక్కడ ఉన్నానో కనిపెట్టింది. నా కోసమే మాల్‌కి వచ్చింది. నేను మాల్ నుండి నేరుగా.." అంటూ ఫోన్ కట్ అయింది.

అగస్త్య, "హలో డాక్టర్ హలో" అని ఫోన్ జేబులో పెట్టుకుని వేగంగా బండిమీద మాల్ వద్దకు చేరుకున్నాడు.

మాల్ మొత్తం జనంతో కిక్కిరిసిపోయి ఉంది. వెంటనే తన ఐటీ బృందానికి కాల్ చేసి అతను తనకు కాల్ చేసిన నంబర్ ట్రేస్ చేయమని అడిగాడు. దాని లొకేషన్ అదే మాల్ అని చూపించింది. వెంటనే మాల్ సెక్యూరిటీ రూం వద్దకు వెళ్ళి సీసీ టీవీ ఫుటేజ్ చూసాడు. కాల్ వచ్చిన సమయం నుండి ఎంట్రీ వద్ద ఫుటేజ్ చూసాడు. భరద్వాజ లోపలకు రావడం గమనించాడు. అతడినే అనుసరిస్తూ మరికొన్ని కోణాల్లో ఫుటేజ్ చూసాడు. ఒక మూల ఇద్దరు భరద్వాజలు ఉండటం చూసి ఆశ్చర్యపోయాడు. వాళ్ళలో బయటనుండి వచ్చిన భరద్వాజను లోపల ఉన్న భరద్వాజ ఒక చిన్న కత్తితో మెడమీద

పొడిచి అతడ్ని స్టోర్ రూములోకి నెట్టేయడం చూసాడు. అగస్త్యకు ఒళ్ళు జలదరించింది. వెంటనే ల్యాబ్‌లో కలిసిన భరద్వాజకు కాల్ చేసాడు. అతను భద్రంగా ఉన్నాడని తెలుసుకుని, కొత్త నంబర్‌కు కాల్ చేసాడు.

స్విచ్చాఫ్ వస్తుందేమో అనుకున్న అగస్త్య ఆలోచనలకు భిన్నంగా ఫోన్ రింగయ్యింది. వెంటనే ఫోన్ చెవి దగ్గర పెట్టుకుని అటువైపు నుండి స్పందన కోసం చూసాడు.

అటునుండి, "అగస్త్యా నీ కాల్‌ను ఆ క్లోన్ ట్యాప్ చేస్తుంది. నన్ను చంపడానికి అసంపూర్తిగా సిద్ధమైన క్లోన్‌ను పంపింది. నేను దాని అడ్డు తొలిగించుకుని సేఫ్ ప్లేస్‌కి వెళ్ళిపోతున్నాను. నువ్వు ల్యాబ్‌లో కలిసిన క్లోన్‌ను అంతం చేస్తే అన్ని సమస్యలు తీరిపోతాయి. నువ్వు ఆ దిశగా ఆలోచించు" అని ఫోన్ కట్ అయ్యింది.

వెంటనే తిరిగి కాల్ చేసాడు. ఫోన్ స్విచ్చాఫ్ వచ్చింది.

అగస్త్యకు అసహనం వచ్చింది. వెంటనే సెక్యూరిటీ రూమునుండి స్టోర్ రూం వద్దకు వెళ్ళి చూసాడు. అక్కడ చనిపోయిన భరద్వాజ శవం లేదు. అగస్త్యకు ఏం జరుగుతుందో అర్థం కాలేదు.మాల్ నుండి వేగంగా బయటకు వచ్చాడు.

బండి స్టార్ట్ చేసి, 'ఇప్పుడు ఎక్కడికి వెళ్ళాలి? ఒక భరద్వాజ కళ్ళముందు చచ్చాడు. ఇంకొకడు 'నేనే అసలైన భరద్వాజ ల్యాబ్‌లో ఉన్నవాడిని చంపు' అన్నాడు. ల్యాబ్‌లో ఉన్నవాడు 'నేనే అసలైన భరద్వాజ, బయట ఉన్నవాడిని చంపు' అంటున్నాడు. అంతా తలపోటులా ఉంది. ముందా ల్యాబ్‌లో ఉన్న భరద్వాజ నిజమైన వాడో కాదో తెలుసుకోవాలి అనుకుని ల్యాబ్‌వైపు వెళ్ళాడు.

ల్యాబ్ తలుపులు తెరిచి ఉన్నాయి. లోపల అంతా నిశ్శబ్దంగా ఉంది. అగస్త్య అడుగులో అడుగు వేస్తూ మెల్లిగా లోపలకు వెళ్ళాడు. బయటనుండి ఎవరో లోపలకు వచ్చినట్టు బురద అంటుకున్న షూ ముద్రలు కనిపించాయి. వెంటనే తుపాకీ బయటకు తీసి ట్రిగ్గర్ అన్లాక్ చేసాడు. కారిడార్‌లో నడుస్తూ ముందుకు

వెళ్ళాడు. హఠాత్తుగా కారిడార్ చివరనుండి భరద్వాజ అరుపులు వినిపించాయి. అగస్త్య వేగం పెంచి అటుగా పరుగున వెళ్ళాడు. ల్యాబ్ కాన్ఫ రెన్స్ హాల్ నుండి శబ్దాలు రావడం గమనించి తలుపు సందునుండి లోపలకు చూసాడు. లోపల చూసిన దృశ్యం అగస్త్య మెదడును మొద్దుబారినట్టు చేసింది. శరీరం కదలడంలేదు. లోపల పది భరద్వాజని పోకిన కోన్స్ ఉన్నాయి. అవి ఒకదాని మీద మరొకటి దాడి చేసుకుంటున్నాయి.

అగస్త్య ఒక్కసారిగా దిమ్మెరపోయి, 'వామ్మో! ఇందాక ముగ్గురిలో అసలైన డాక్టర్ ఎవడో కనిపెట్టడమే సాధ్యం కాలేదు. ఇంకిప్పుడు అసాధ్యం' అనుకుంటూ ట్రిగ్గర్ లాక్ చేసి తుపాకీ తగిలించుకుని ఫోన్ బయటకు తీసాడు.

సరిగ్గా అప్పుడే ఒక కొత్త నంబర్ నుండి ఫోన్ వచ్చింది. వాల్యూం ఎక్కువగా ఉండటంతో ఆ పదిమంది దృష్టి అగస్త్యమీద పడింది. వాళ్ళలో వాళ్ళు కొట్టుకోవడం ఆపేసి అగస్త్యవైపు పరుగున వచ్చారు. అగస్త్య కంగారుతో తలుపును దగ్గరకు లాగి బయటనుండి గడియ పెట్టేసాడు. వారి వేగం దెబ్బకు భయంతో అగస్త్యకు గుండె ఆగినంత పనయ్యింది.

ఈలోపు మోగుతున్న ఫోన్ ఆగిపోయింది. వెంటనే ఆ నంబరుకు కాల్ చేసాడు. ఫోన్ రింగయ్యింది.

అటునుండి, "అగస్త్య నేను అసలైన భరద్వాజను లోపల ఉన్నాను. తలుపు తీసి నన్ను కాపాడు. నేను రెడ్ కలర్ డ్రెస్ వేసుకున్నాను. నన్ను తప్ప మిగతా వాళ్ళను షూట్ చేసి చంపెయ్" అని చిన్న గొంతుతో చెప్పాడు.

తలుపు వద్దకు మొహం పెట్టి కీ హోల్‌నుండి లోపలకు చూసాడు. వాళ్ళలో రెడ్ డ్రెస్ వేసుకున్నవాడు కనిపించాడు. అతనికి కాల్ చేసి ప్రూఫ్ అడగాలనుకున్నాడు. అంతలో తనకు మరొక నంబర్ నుండి కాల్ వచ్చింది. లిఫ్ట్ చేసాడు.

అటునుండి, "అగస్త్యా నేను అసలైన భరద్వాజను లోపలున్నాను. తలుపు తీసి నన్ను కాపాడు నేను బ్లాక్ హుడ్ వేసుకున్నాను. నన్ను తప్ప మిగతా వాళ్ళను షూట్ చేసి చంపెయ్. ఇదే మనకి మంచి అవకాశం" అని చిన్న గొంతుకతో వినిపించింది.

కీ హోల్ నుండి మళ్ళీ చూసాడు. లోపల హుడ్ వేసుకున్న ఒక భరద్వాజ ఫోన్ పట్టుకుని ఉన్నాడు. అలా ఒక కాల్ తర్వాత మరొక కాల్ వచ్చింది. అలా ఒకరి తర్వాత ఒకరు పదిమంది పదిసార్లు ఫోన్ చేసి పది పోలికలు గుర్తులు చెప్పి తనని తప్ప మిగతా వాళ్ళని చంపేయమని అడిగారు.

అగస్త్య బుర్ర వేడెక్కింది. అతనికేం చెయ్యాలో అర్థంకాలేదు. సహాయం కోసం స్టేషన్‌కి కాల్ చేయడానికి ప్రయత్నం చేశాడు. ఎన్నిసార్లు చేసినా కాల్ కనెక్ట్ కాలేదు. అక్కడనుండి వెనక్కి నడుస్తూ తన మొబైల్లో సేవ్ చేసుకున్న భరద్వాజ నంబర్‌కు కాల్ చేసాడు. కాల్ కనెక్ట్ అయ్యింది.

అగస్త్య, "డాక్టర్ మీరెక్కడున్నారు? ఇక్కడంతా గందరగోళంగా ఉంది" అని అడిగి, 'అబ్బా! ఇతనే అసలైన భరద్వాజ అని నేను కన్ ఫర్మ్ చేసుకోలేదు కదా...' అనుకున్నాడు.

అటునుండి, "నీకు ఉదయమే చెప్పాకదా అగస్త్యా వాటికి మనిషికున్న అన్ని లక్షణాలు ఉన్నాయి. అవి నిన్ను చాలా త్వరగా మోసం చేస్తాయి. నువ్వే ఆలోచించి అసలైన భరద్వాజ ఎవరో కనిపెట్టాలి. నీకో ముఖ్యమైన సమాచారం ఇవ్వడం మరిచిపోయాను. ఆ ఆర్-9 పరిపోయేముందు అన్ని క్లోన్స్‌ను రిలీజ్ చేసింది. సుమారు ఇరవై క్లోన్స్ ఇప్పుడు బయట వున్నాయి. అన్నింటిలోనూ నాలాంటి ఆలోచనలున్న బుర్రనే ఉంది. చాలా జాగ్రత్త వహించాలి అగస్త్యా" అని అసలు విషయం చెప్పాడు.

అగస్త్య, "నేనిప్పుడు ల్యాబ్‌లోనే ఉన్నాను డాక్టర్. మిమ్మల్ని ఒకసారి కలవాలి" అనడిగాడు.

"వ్వాట్! ఇక్కడికెందుకొచ్చావు? నీకు ప్రాణాలమీద ఆశలేదా? దాదాపు పది క్లోన్స్ అసలు భరద్వాజ నేనంటే నేనని తన్నుకు చస్తున్నాయి. అవిగానీ నిన్ను గానీ, నన్నుగానీ చూసాయో అదే మనకు ఆఖరి రోజు."

అతని మాటలు పూర్తికాకుండానే, "మీరెక్కడ ఉన్నారో చెప్పండి డాక్టర్. నేనే అక్కడికి వస్తాను" అంటూ కారిడార్‌కు మరొకవైపు చివరికంటా పరుగులు తీశాడు అగస్త్య.

"నేను ల్యాబ్ మైనస్ టు ఫ్లోర్‌లో ఉన్నా అగస్త్యా! గుర్తుపెట్టుకో నిన్నెవరూ ఫాలోకకుండా చూసుకో. లేదంటే నీ ప్రాణాలతోపాటు నావి కూడా పోతాయి."

"మీరే నిజమైన డాక్టర్ అని నాకనిపిస్తే నా ప్రాణం అడ్డువేసి మీ ప్రాణాలు కాపడతాను" అని లిఫ్ట్ ఎక్కాడు.

లిఫ్ట్‌లో ఒక శవం పడుంది. బలమంతా ఉపయోగించి శవాన్ని తిప్పి మొహం చూసి ఆశ్చర్యపోతూ, 'దేవుడా! ఇది అసలైన డాక్టర్ కాకూడదు' అనుకునే లోపు లిఫ్ట్ మైనస్ సెకండ్ ఫ్లోర్‌లో ఆగింది. మెల్లిగా తలుపు తెరుచుకుంది. అగస్త్య బయట గమనించకుండా అలానే శవం వంక చూస్తూ నిలబడ్డాడు.

మొదట కలిసిన భరద్వాజ తుపాకీ గురిపెట్టి, "అగస్త్యా! వాడ్ని నేనే షూట్ చేసాను. వాడు కూడా ఓ క్లోన్. నువ్వు త్వరగా లిఫ్ట్ నుండి బయటకు రా" అని అగస్త్య బయటకు రాగానే లిఫ్ట్‌ను పూర్తిగా ఆఫ్ చేసాడు.

అగస్త్య తన తుపాకీ మీద చెయ్యి తీయకుండా తనతో నడవడం చూసి "నువ్వు నన్ను ఇంకా నమ్మడంలేదా? నేనే అసలైన భరద్వాజను" అన్నాడతను.

ఇద్దరూ నడుస్తూ ఒక గది వద్దకు వెళ్ళారు. అతను తలుపు ఫింగర్ ప్రింట్ ద్వారా అన్లాక్ చేసి లోపలకు అడుగువేసాడు. వెనుకనే అగస్త్య కూడా అడుగులు వేయబోయాడు. అంతే తలుపు వెనకనుండి నగ్నంగా ఉన్న మరొక భరద్వాజ రూపం హఠాత్తుగా ప్రత్యక్షమై అగస్త్యతో వచ్చిన భరద్వాజ మీద దాడి చేసి చేతిలో తుపాకీ అందుకుని అతని శరీరంలో తూటాలు దింపాడు. కనురెప్పపాటు కాలంలో జరిగిన సంఘటన అగస్త్యను కొయ్యబొమ్మలా మార్చింది.

వెంటనే తన తుపాకీ గురిపెట్టి, "ఎవరు నువ్వు?" అనడిగాడు.

అతను, "అగస్త్యా నేను అసలైన డాక్టర్ భరద్వాజను. వీడు నా మీద ఎటాక్ చేసి నా బట్టలు వాడు వేసుకున్నాడు. వీడు కూడా ఓ క్లోన్. ఇది మాత్రమే కాదు, పైనున్న క్లోన్స్ అన్నీ నా బట్టలే వేసుకున్నాయి. నేనే ఒకదాని తరువాత మరొకటి అంతం చేస్తూ ల్యాబ్ నుండి బయటపడాలి అనుకున్నాను. నేనా ఆర్ – 9 గురించి ఆలోచిస్తూ మిగతా వాటిని సెక్యూర్ చేసే పని మర్చిపోయను. పద, పోదాం అగస్త్యా. మనం అదే లిఫ్ట్ నుండి పైకెళ్ళి ఒక్కోదాన్ని అంతం చేద్దాం" అన్నాడు.

అగస్త్య, "మీరే అసలైన భరద్వాజ అనడానికి ఋజువు ఏంటి? మీరు మిమ్మల్ని ప్రూవ్ చేసుకుంటేనే నేను మీతో పైకి వస్తాను. లేదంటే మిమ్మల్ని షూట్ చేసి పైకి వెళ్ళి వాళ్ళను కూడా ఒక్కరు మిగలకుండా అందర్నీ షూట్ చేస్తాను" అని తుపాకీని అతని తలకు గురిపెట్టాడు.

అతడు కంగారుపడుతూ, "అగస్త్యా నువ్వు డిపార్ట్‌మెంట్‌లోకి చేరడానికంటే ముందు ఓ తప్పు చేసావు. దానిని కప్పిపుచ్చుకోవడం కోసం ఒకరిని బలిచేసావు. ఈ విషయం నాకు మాత్రమే తెలుసు. ఇంకెవరికీ తెలియదు. నేనే అసలైన భరద్వాజ. నన్ను నమ్ము" అని సహాయం కోసం అర్థించాడు.

అగస్త్య ఒక్క క్షణం ఆలోచించి "ఏదయితే అది, మిమ్మల్ని నమ్ముతాను డాక్టర్. పదండి" అని చనిపోయిన క్లోన్ బట్టలు తీసి అతనికిచ్చాడు. భరద్వాజ తొడుక్కున్న తర్వాత ముందుకు నడిచాడు. నెమ్మదిగా కాన్ ఫరెన్స్ హాల్ తలుపు తెరిచి లోపల నుండి వచ్చిన అందరినీ ఇద్దరూ కలిసి షూట్ చేసి చంపారు.

కారిడార్ మొత్తం రక్తసిక్తమైంది.

ఇద్దరూ నడుస్తూ హాల్లోకి చేరుకున్నారు. సరిగ్గా అప్పుడే మరొక భరద్వాజ ల్యాబ్ చేరుకున్నాడు. ముగ్గురికి ఒకరికి మరొకరు ఎదురుపడ్డారు.

ల్యాబ్‌లోకి వచ్చిన బరద్వాజ, "అగస్త్యా అదే 'ఆర్ -9 ' దానిని షూట్ చెయ్యి లేదంటే ఇక్కడనుండి తప్పించుకుంటుంది" ఐ కారిడార్ వైపు చూసి, "ఐతే మిగతా క్లోన్స్ కూడా బయటకు వచ్చాయి. నాకు తెలుసు అవి బయటకు రాగానే ఆర్ - 9 వాటిని చంపుతుందని లేకపోతే అవే ఆర్ -9ను చంపేసేవి. ఇక మిగిలింది నువ్వే ఆర్ -9, నిన్ను కూడా చంపేసి ఈ ఆటకు ఓ ముగింపు ఇస్తాను" అని ట్రిగ్గర్ అన్లాక్ చేసాడు.

అగస్త్యతో పాటు ఉన్న భరద్వాజ, "అగస్త్యా ఆర్-9 తెలివి గురించి నీకు ముందే చెప్పాను. అది మనిషిని మించి నటిస్తుంది. దానిని నమ్మొద్దు. నేనే అసలైన భరద్వాజ, కొన్ని నిమిషాల క్రితమే నన్ను నేను ప్రూవ్ చేసుకున్నాను. వాడ్ని షూట్ చెయ్యి" అని తుపాకీ అతని వైపు గురిపెట్టాడు.

వారి మాటలకు అగస్త్య పూర్తి అయోమయ స్థితిలో కూరుకుపోయాడు.

ఎవరు అసలైన డాక్టరో అర్థం కాక తలపట్టుకున్నాడు.ఈలోగా వాళ్ళిద్దరూ ఒకేసారి, అసలైన భరద్వాజ నేనంటే నేను అని అరవడం మొదలుపెట్టారు.

అగస్త్య ఏకాగ్రతతో కొన్నిక్షణాలు ఆలోచించి లిప్తపాటు సమయంలో వాళ్ళిద్దరి గుండెల్లో తూటా దింపి, "మీరిద్దరిలో కూడా అసలైన భరద్వాజ లేడు" అని బిగ్గరగా అరిచాడు.

ఆ తర్వాత కొన్ని క్షణాలు అగస్త్య అలానే నిలబడిపోయాడు.

అంతలో మెషిన్ గన్స్ పట్టుకుని నలుగురు లోపలకు వచ్చారు. వాళ్ళ వెనుక తెల్లటి ఏప్రాన్ వేసుకుని డాక్టర్ భరద్వాజ వచ్చాడు. అగస్త్య వాళ్ళని విచిత్రంగా చూస్తూ గన్ వాళ్ళవైపు గురిపెట్టి, "మళ్ళీ మీరెవ్రా బాబూ" అని డాక్టర్ వంక చూసి తుపాకీ దించి అతని వైపు అడుగులు వేసాడు.

డాక్టర్ కూడా అగస్త్యవైపు అడుగులు వేసి, "అగస్త్యా! నువ్వీ టెస్ట్‌లో పాసయ్యావు కానీ, అంతకంటే ముందు నువ్వు వీళ్ళని క్లోన్స్‌గా ఎలా గుర్తించావు?" అనడిగాడు.

అగస్త్య, "టెస్టా ఆనా కర్ధంకాలేదు డాక్టర్" అని అయోమయంగా చూసాడు.

డాక్టర్ "నిజానికి నీకు కనిపించిన వాళ్ళందరూ క్లోన్స్ కాదు. వాళ్ళందరూ సిమ్యులేషన్ ప్రోగ్రాంలో ఓ భాగం. నీ గన్, ఈ ల్యాబ్, నీ మెమోరీస్ అన్నీ మేము సెట్ చేసినవే. అన్నిటికంటే ముఖ్యమైన విషయం నువ్వొక క్లోన్" అన్నాడు.

అంతే అగస్త్య చేతి పట్టు సడలి తుపాకీ కిందపడింది.

డాక్టర్, "అవును నువ్వు అగస్త్య అనే డిటెక్టివ్ యొక్క క్లోన్. అతను చనిపోయిన తర్వాత, అతని డి.ఎన్.ఏ నమూనాలు కలెక్ట్ చేసి నిన్ను ల్యాబ్‌లో నేనే సిద్దం చేసాను. నీకు అగస్త్య మెమరీ ఐతే ఇవ్వగలం గానీ, నీలో అతనిలా సత్తా నింపడం మావల్లకాలేదు. అది అంతర్గతంగా జరగవలసిందే. మేము అగస్త్యను ముద్దుగా రాయల్ ఏజెంట్ అని పిలిచేవాళ్ళం. అతని పేరు మీదుగానే క్లోన్స్‌కి 'ఆర్ ' అని పెట్టాను. ఇప్పటివరకూ ఎనిమిదిసార్లు నీలాంటి అగస్త్య క్లోన్స్ ఫెయి అయ్యాయి. నువ్వే పాసయ్యావు" అని అసలు విషయం చెప్పాడు.

అగస్త్య క్లోన్ ఆలోచిస్తూ, "అంటే ఆర్-9 మరెవరోకాదు నేనే" అని ఒక్కసారిగా కళ్ళు పెద్దవి చేసుకుని తనను తాను చూసుకున్నాడు.

డాక్టర్, "ఇంతకీ నువ్వా ప్రశ్నలకు సమాధానం చెప్పనేలేదు" అనడిగాడు.

అగస్త్య, "క్లోన్స్ అన్నీ ఒకే మెమరీ పంచుకుంటే కింద ఫ్లోర్‌లో భరద్వాజ చెప్పిన విషయం అన్ని క్లోన్స్‌కి తెలిసే ఉంటుంది. అలాగే బయటి నుండి వచ్చిన క్లోన్ పట్టపగలు మాలో మరొక క్లోన్‌ను హత్య చేసింది. అక్కడా శవం కూడా లేదు. నిజమైన డాక్టర్ అంటే మీకు ఎదుటి వాళ్ళ ప్రాణాలు తీసే రాతి హృదయం లేదు. వీటిని ఆధారంగా తీసుకుని మాత్రమే కాదు.నా మనసు కూడా వాళ్ళ కళ్ళలో అబద్ధాన్ని గ్రహించాయి. నన్ను నమ్మించే ప్రయత్నంలో వాటి ఉనికిని అవే బయట పెట్టాయి" అని చెప్పాడు.

డాక్టర్ కళ్ళలో ఓ మెరుపు వచ్చింది.

తన వెనుకున్న ఏజెంట్స్ వంక చూసాడు. ఒకడు ముందుకొచ్చి అగస్త్య క్లోన్ శరీరంలో ట్రాంక్విలైజర్ షాట్ ఇచ్చి బయటకు తీసుకుని వెళ్ళిపోయాడు.

డాక్టర్ కూడా వాళ్ళ వెనుక బయట అడుగులు వేస్తూ, 'అగస్త్యా నువ్వు ఓడిపోయావు. మనసుతో పని చేసే క్లోన్‌ను సిద్దం చేయడం నావల్ల కాదన్నావు. అది దేవుడికే సాధ్యమన్నావు. నేను చేసి చూపించాను. నిజానికి నన్ను గెలిపించింది కూడా నువ్వే. వారిలో వున్నది కూడా నీ డి.ఎన్.ఏ నే కదా' అనుకున్నాడు.

COMMENTS